### సొంతూరిలో కంపెనీ పెట్టడం గర్వంగా ఉంది



నేను పుట్టి పెరిగింది మొత్తం కరీంనగర్‌లోనే. ఇక్కడి రాంనగర్ హైస్కూల్ పదో తరగతి వరకు, అల్ఫోర్స్‌లో ఇంటర్, శ్రీచైతన్య కళాశాలలో బీటెక్ పూర్తి చేశా. అదే క్రమంలో కంపెనీ మొదలు పెట్టాలనే ఆలోచనతో ఉన్నాం. ఇదే క్రమంలో కరీంనగర్‌లో ఐటీ టవర్ మొదలవడంతో స్థానికులకు ఉద్యోగాలు కల్పించిన వారం అవుతామన్న ఆలోచనతో అర్బన్ సర్వీసెస్ సంస్థను నా మిత్రుడు పవన్‌తో కలిసి స్థాపించాం. దీని ద్వారా మొబైల్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, యాప్ డెవలప్‌మెంట్ సేవలను నేరుగా అందిస్తున్నాం. కరీంనగర్‌లో ఇలాంటి ఒక సంస్థ నడుస్తుండడం, ఇందులో మన ప్రాంతానికి చెందిన వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం చాలా గర్వంగా ఉంది. మా సంస్థలో ప్రస్తుతం 20 మంది ఉద్యోగాలు చేస్తున్నారు. దాదాపు 120 మంది స్థానికంగా పని నేర్చుకుని, దేశవ్యాప్తంగా ఉన్న చాలా ఎంఎన్‌సీ సంస్థల్లో ఉద్యోగాల చేయడానికి అర్హత సాధించారు. ప్రభుత్వం మా లాంటి స్టార్టప్ సంస్థలను ప్రోత్సహించడం వల్ల ఇలాంటి విజయాలు సాధ్యమవుతాయి.

***- ప్రణయ్ కుమార్ ఎనగంటి, డైరెక్టర్, అర్బన్ టెక్***



- **12 కంపెనీలు.. 600 మంది ఉద్యోగులు**
- **150 మందితో టాస్క్ శిక్షణ కేంద్రం**
- **హైదరాబాద్ తర్వాత కరీంనగర్‌లోనే అభివృద్ధి**

కరీంనగర్ ఉజ్వల పార్క్ సమీపంలో ఏర్పాటు చేసిన ఐటీ టవర్

# కరీంనగర్‌లో ఐటీ హవా




వారధి యాప్‌ను ఆవిష్కరిస్తున్న అప్పటి కలెక్టర్ కర్ణన్ తదితరులు

కమాన్‌చౌరస్తా, నవంబర్ 19: గతంలో ఐటీ అంటే బెంగళూరు, చెన్నై, ముంబై, పూణే నగరాలే కనిపించేవి. కానీ, స్వరాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో ఐటీ రంగం గణనీయమైన అభివృద్ధి సాధించింది. అంతే కాకుండా, ఐటీని రెండో స్థాయి నగరాలకు విస్తరింపజేయాలని సీఎం కేసీఆర్‌తో పాటు, మంత్రి కేటీఆర్ భావించారు. ఈ క్రమంలోనే స్థానిక ఎమ్మెల్యే, మంత్రి గంగుల కమలాకర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ కృషితో కరీంనగర్‌కు ఐటీ టవర్ కేటాయించారు. దీనిని 2020, జూలై 21న ప్రారంభించగా, 12 సంస్థల్లో దాదాపు 600 మంది వరకు ఉద్యోగాలు చేస్తున్నారు. వీటితోపాటు ఇందులో నిర్వహిస్తున్న తెలంగాణ అకాడమీ ఫర్ నాలెడ్జ్ అండ్ స్కిల్(టాస్క్) కేంద్రంలో సైతం దాదాపు 150 మంది అభ్యర్థులు శిక్షణ పొందుతూ దేశ వ్యాప్తంగా వివిధ ఐటీ కంపెనీల్లో ఉద్యోగాలకు సిద్ధమవుతున్నారు.

### 12 సంస్థల కార్యకలాపాలు

2020 జూలైలో ప్రారంభమైన ఐటీ టవర్‌లో ప్రస్తుతం 12 సంస్థలు తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఇందులో వీటా, టీం అప్, సృజనా కన్సల్టెన్సీ, అర్బన్ టెక్ సర్వీసెస్, సంస్కృతి, ట్రెస్సీస్, క్లస్టర్ ఐటీ, ఆస్నెక్టైసైట్స్, అన్నెక్స్ ఆక్, ఈఎక్స్ఎం 10, అలీ అన్సార్సీ టెక్నాలజీస్, ఎస్ఆర్‌కే టెక్నాలజీస్ సంస్థలు కొనసాగుతుండగా, ఇందులో సంస్థను బట్టి దాదాపు 400 మంది కార్యాలయంలో, వర్క్‌ఫ్రం హోంలో 200 మంది వరకు ఉద్యోగాలు చేస్తున్నారు.

### ఆధునిక హంగులు..

ఐటీ టవర్‌ను 65 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఐదు అంతస్తుల్లో (జీ ప్లస్ 5) నిర్మించారు. ఒక్కో ఫ్లోర్ సుమారు 12 వేల చదరపు అడుగుల విస్తీర్ణానికి మించి ఉండగా, అధునాతన సౌకర్యాలు కల్పించారు. 'ప్లగ్ అండ్ ప్లే' విధానంలో కంపెనీలకు స్థలం కేటాయిస్తున్నారు. ఇందులో వివిధ కంపెనీలు ఎంపిక చేసే యువతకు శిక్షణ ఇచ్చేందుకు 1900 చదరపు అడుగుల వైశాల్యంతో లర్నింగ్ సెంటర్‌ను సిద్ధంగా ఉంచారు. ఈ టవర్‌లో సమాచారం తెలుసుకునేందుకు రిసెప్షన్ లాబీని ఏర్పాటు చేశారు. 1500, అలాగే 3 వేల చదరపు అడుగులతో క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. సెంట్రల్ ఏసీ సౌకర్యాన్ని కల్పించారు. ఒక్కో లిఫ్టులో ఒకేసారి 13 మంది వెళ్లి వచ్చేలా రెండు లిఫ్టులు పెట్టించారు.

### కరీంనగర్‌కు ఐటీ మాకు గర్వకారణం



అందరూ బీటెక్ అయిపోగానే ఎలాంటి ఉద్యోగం చేయాలనే ఆలోచనలో ఉంటారు. కానీ, నేను అలా అనుకోలేదు. కరీంనగర్‌లో నాలాంటి యువతకు ఉద్యోగాలు కల్పించాలనే ఉద్దేశంతో ఉన్నా. ఇదే క్రమంలో నా మిత్రుడు ప్రణయ్‌తో కలిసి అర్బన్ టెక్ సర్వీసెస్‌ను 2019లో మొదలు పెట్టాం. 2021లో కరీంనగర్‌లో ఐటీ టవర్ ప్రారంభించిన తర్వాత అందులో స్పేస్ తీసుకుని మా సేవలు చాలా విస్తరించాం. కరీంనగర్‌లో ఐటీ టవర్ ప్రారంభించడం మాకెంతో కలిసి వచ్చింది. మా సంస్థ ద్వారా ఐటీ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, మొబైల్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, రిక్రూట్‌మెంట్ మేనేజ్‌మెంట్, ఏపీఐ ఇంటిగ్రేషన్స్ అండ్ ఏఐ ఆటోమేషన్ సర్వీసెస్‌ను అందిస్తున్నాం. ఈ క్రమంలో అనతి కాలంలోనే రూ.60 లక్షల నుంచి రూ.కోటి వరకు టర్నోవర్ అందించే స్థాయికి వచ్చాం. రెండో స్థాయి నగరాలకు ఐటీని విస్తరింపజేయాలనే ఆలోచనతో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, స్థానిక మంత్రి గంగుల ఆలోచనలకు హ్యాట్సాఫ్.

***-గట్టిగొప్పల పవన్ కుమార్, సీఈవో, అర్బన్ టెక్, సర్వీసెస్***

### స్థానికంగానే ఉపాధి అవకాశాలు



మాది సిరిసిల్ల. నేను డిగ్రీ వరకు కరీంనగర్, సిరిసిల్లలోనే చదివా. మాస్టర్స్ నెదర్లాండ్‌లో పూర్తి చేశా. ఈ క్రమంలో టెక్నికల్ సపోర్ట్ ఆఫ్ డెవలప్‌మెంట్స్‌కు మన దేశంలో మంచి భవిష్యత్తు ఉంది. ఈ క్రమంలో హైదరాబాద్‌లో సంస్థను ప్రారంభించి సేవలు అందిస్తున్నాం. ఇదే క్రమంలో కేటీఆర్ ఆధ్వర్యంలో ప్రతి జిల్లాకు ఐటీ సేవలను ప్రారంభించాలనే సంకల్పంలో మేం సైతం భాగస్వాములవ్వాలని ముందుకు వచ్చాం. ఇందులో భాగంగా కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన ఐటీ టవర్‌లో వర్క్ స్పేస్‌ను తీసుకుని స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాం. ఇందులో టెక్నికల్ సర్వీసెస్ అందిస్తున్నాం. ఇప్పటి వరకు 35 మందికి స్థానికంగా ఉద్యోగాలు కల్పించాం. అలాగే, ఐటీ కన్సల్టెంట్‌గా వ్యవహరిస్తూ వివిధ సంస్థలకు వర్క్ ప్రాసెసింగ్ చేస్తూ స్థానిక యువతకు ఎక్కువ సంఖ్యలో ఉద్యోగాలు కల్పించేందుకు కృషి చేస్తున్నాం.

***- అనుగుల శరత్ కుమార్, సృజనా కన్సల్టెన్సీ, సీఈవో***

### ప్రభుత్వ ప్రాజెక్ట్‌లకు సేవలందిస్తున్నాం



2021 నుంచి కరీంనగర్‌లో ప్రారంభమైన ఐటీ టవర్‌లో స్టార్టప్‌గా మా సంస్థను ప్రారంభించాం. అప్పటి నుంచి 30 నుంచి 40 మంది యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తూ, తెలంగాణ ప్రభుత్వ ప్రాజెక్ట్‌లకు సైతం సేవలందిస్తున్నాం. ఇప్పటి వరకు కరీంనగర్‌లో అందించిన సేవలను విస్తరింపజేస్తూ, ప్రస్తుతం సిద్దిపేటలోని ఐటీ టవర్‌లోనూ సంస్థను ప్రారంభించాం. ఇక్కడ 15 మందికి ఉద్యోగావకాశాలు కల్పించాం. మరో 40 మందికి ఉద్యోగావకాశాలు కల్పించేలా సంస్థను ఏర్పాటు చేస్తున్నాం. ప్రభుత్వ పోటీ పరీక్షల సమయంలో అప్పటి కరీంనగర్ కలెక్టర్ కర్ణన్, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ సహకారంతో వారధి అప్లికేషన్‌ను డెవలప్ చేశాం. దీనిని తెలంగాణకు చెందిన లక్ష మంది వరకు వాడుతున్నారు. అలాగే, సిద్ధిపేట అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ సహకారంతో 'రుతు ప్రేమ' అప్లికేషన్‌ను ప్రారంభించాం. ఇదంతా కరీంనగర్ ఐటీ టవర్‌తోనే సాధ్యమైంది.

***- చైతన్య, సీఈవో, టీం అప్***

### ప్రోత్సాహం అందిస్తున్నాం



అన్నెక్స్‌ఆక్ సంస్థ పూర్తిగా అమెరికాకు చెందినది. ఇందులో స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో కరీంనగర్‌లో స్థానిక నాయకుల సహకారంతో కార్యాలయాన్ని ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నాం. ఇందులో దాదాపు 20 మంది యువతీయువకులు ఉద్యోగాలు చేస్తున్నారు. అలాగే, వర్క్‌ఫ్రం హోంలో 20 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. దీని ద్వారా ఎస్ఏపీ, ఫైనాన్స్ సర్వీసెస్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఇలా చాలా సర్వీసెస్‌లో ఉద్యోగాలు అందిస్తున్నాం. ఇక్కడ యువతలో చాలా వృత్తి నైపుణ్యాలున్నాయి. వాటిని వెలికి తీసి ఉద్యోగాల్లో రాణించేలా చేస్తున్నాం. ఇక్కడ ప్రతిభ చూపిన ఉద్యోగులను వివిధ ప్రాంతాల్లో ఉన్న మా సంస్థల్లో ఉద్యోగాలకు సిఫార్సు చేస్తున్నాం.

***- టీ వినోద్, మేనేజర్, అన్నెక్స్‌ఆక్***

# కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి

- **చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్**
- **బూరుగుపల్లిలో బీడీ టేకేదార్లతో సమావేశం**
- **బీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటించిన టేకేదార్లు**



బూరుగుపల్లిలో ఎమ్మెల్యే రవిశంకర్‌కు మద్దతు తెలుపుతున్న బీడీ టేకేదార్లు

గంగాధర, నవంబర్ 19: సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణలో అభివృద్ధి సాధ్యమని, ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేయడంలో కేసీఆర్‌ను మించిన నాయకుడు లేడని చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కొనియాడారు. బూరుగుపల్లిలో నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన బీడీ టేకేదార్లతో సుంకె రవిశంకర్ ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టేకేదార్లు బీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. బీడీ టేకేదార్లకు పింఛన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో ప్రజారంజకంగా ఉందన్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ధీమా కింద ₹5 లక్షల బీమా, ₹400కే సిలిండర్, ₹5 వేల ఆసరా పింఛన్, దివ్యాంగులకు ₹6వేలు, రైతులకు పెట్టుబడి సాయంగా ₹16 వేలు ఇస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య శ్రీని ₹15లక్షలకు పెంచుతున్నట్లు తెలిపారు. భవ్యక్షేత్రం కొండగట్టు ఆలయాన్ని ₹వెయ్యి కోట్లతో అద్భుతంగా తీర్చిదిద్దనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు వచ్చిపోయేవారిని నమ్మవద్దని, స్థానికేతరులకు ఓటు వేస్తే అభివృద్ధి కుంటుపడుతుందని తెలిపారు. స్థానిక సమస్యలపై అవగాహన ఉండి ఐదేళ్లలో ₹1800 కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన తనను మళ్లీ ఆశీర్వదించి గెలిపిస్తే మరిత అభివృద్ధి చేస్తానని భరోసా ఇచ్చారు.

# కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావాలని యాగం

- **పాల్గొన్న బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి**



రాజ్యశ్యామల యాగం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి దంపతులు

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 19: బీఆర్ఎస్ తెలంగాణలో మూడోసారి అధికారంలోకి రావాలని, పార్టీ అధినేత కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావాలని, తాను హుజూరాబాద్ ఎమ్మెల్యేగా గెలువాలని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి హోమం నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి ఆయన సతీమణి శాలిని, కుమార్తె శ్రీనికారెడ్డి, ఇతర కుటుంబసభ్యులతో కలిసి పట్టణంలోని విద్యానగర్‌లో గల ఆయన నివాసం వద్ద ఆదివారం మహా గణాధిపతి, రాజ్యశ్యామల, బగలముఖి, చండీ సుదర్శన కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి మాట్లాడారు. దేశంలోనే ఎక్కడా లేనన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తూ.. తెలంగాణ రాష్ట్రాన్ని సుభిక్షంగా తయారుచేసి ప్రజలందరి మన్ననలు పొందిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో పార్టీ రాష్ట్రంలో మూడోసారి అధికారంలోకి రావాలని కోరుకున్నట్లు తెలిపారు. దానికి భగవంతుడు, ప్రజల ఆశీస్సులు ఉండాలని కోరారు. కార్యక్రమంలో కౌశిక్‌రెడ్డి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులు గందే రాధిక శ్రీనివాస్, కొలిపాక నిర్మల శ్రీనివాస్ దంపతులు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతిపక్షాల దుష్ప్రచారం నమ్మవద్దు

- **రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్**

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 19: దళిత బంధు విషయంలో ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని దళితులు నమ్మవద్దని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ పేర్కొన్నారు. హుజూరాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా దళిత బంధు పథకం పెడితే దళితులను ఆదుకోవడం పోయి, ప్రతిపక్ష పార్టీలు దానిపై కుట్ర చేస్తున్నాయని పేర్కొన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని 18,600 మంది లబ్ధిదారులకు యూనిట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. వారు ఆర్థికంగా అభివృద్ధి చెందినట్లు పేర్కొన్నారు. దళిత బంధు ఇస్తున్నందుకు సంతోషంగా ఉన్నామని పలువురు దళితులు తెలుపుతున్నారని చెప్పారు. దళితుల ఆర్థికాభివృద్ధికి కృషి చేసిన సీఎం కేసీఆర్‌కు దళితులంతా మద్దతుగా నిలిచి, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల దుష్ప్రచారాన్ని దళితులంతా ఐక్యంగా ఉండి తిప్పికొట్టాలని సూచించారు. సమావేశంలో దళిత బంధు మండల కో-ఆర్డినేటర్ మొలుగూరి ప్రభాకర్, రీసోర్స్ పర్సన్ బత్తుల సమ్మయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.